

శ్రీక్షితకు
బంధుమిత్రుల
ఆశీర్వచనం

ఘనంగా సారీ ఫంక్షన్

హాజరైన
కుటుంబ సభ్యులు

2లో


వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 339 బుధవారం | 31 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# అక్కడ నరుకుడు.. ఇక్కడ నాన్చుడు





ప్రమాదకరంగా
కోనోకార్పస్ మొక్కలు

వివిధ అనారోగ్య సమస్యలకూ
ఇవే కారణం

మానుకోటలో తొలగిస్తున్న
మునిసిపల్ అధికారులు

నిద్రావస్థలో బల్దియా
పాలకవర్గం

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లని పెద్దలు చెప్పారు.. అందుకే ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నాయి. ప్రతి ఏడు లక్షల మొక్కలు నాటుతూ పచ్చదనానికి కృషి చేస్తున్నారు. పచ్చని చెట్లతో గాలిలో ఆక్సిజన్ శాతం పెరిగి అనారోగ్య సమస్యలు కూడా దూరమవుతాయని అందరికీ తెలిసిందే. ఐతే అన్ని రకాల చెట్లు మనకి మంచి చేస్తాయంటే అది పొరబాటే. మానవాళితో పాటు పర్యావరణానికి కూడా ముప్పుగా పరిణమించిన అతి ప్రమాదకరమైన మొక్కల్లో కోనో కార్పస్ ఒకటి. ప్రస్తుతం రోడ్ల పక్కన, డివైడర్లపైనా విరివిగా ఈ చెట్లే దర్శనమిస్తున్నాయి. కోనోకార్పస్ తో శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వృక్ష, పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా కోనోకార్పస్ మొక్కలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేదం విధించింది. అయితే ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వీటిని తొలగించే పనిలో పడినప్పటికీ గ్రేటర్ వరంగల్ అధికారులు మాత్రం నాన్చుడు ధోరణిలో ఉన్నారు. దీంతో ఈ చెట్లను తొలగించాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



2లో

## ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

పరకాలలోనే మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ పి.ప్రావీణ్య

## బలరామునికే.. పార్టీ చీఫ్

ఖరారు చేసిన అధిష్టానం

త్వరలోనే ప్రకటన



8లో..



8లో..

## నిజాయితీతో సేవాలందించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

# అక్కడ నరుకుడు.. ఇక్కడ నాన్చుడు

**ప్రమాదకరంగా కోనోకార్పస్ మొక్కలు**

**వివిధ అనారోగ్య సమస్యలకూ ఇవే కారణం**

**మానుకోటలో తొలగిస్తున్న మునిసిపల్ అధికారులు**

**నిద్రావస్థలో బల్దియా పాలకవర్గం**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** కోనో కార్పస్ చెట్లు సాధారణంగా పచ్చగా, ఏపుగా పెరుగుతాయి. పచ్చదనంతో కళకళలాడుతోంది. ఇవి ఒక శంకు ఆకారంలో ఉంటూ చూడగానే ఆకట్టుకునేలా ఉంటాయి. ఈ మొక్క నాటిన కొన్ని వారాల్లోనే ఏపుగా పెరగడంతో ప్రభుత్వం వీటిని విరివిగా పెంచేందుకు సిద్ధపడింది. వనమహోత్సంలో భాగంగా గత కొన్ని సంవత్సరాలుగా రహదారులకు ఇరువైపుల, డివైడర్లపైన, ఖాళీ ప్రదేశాల్లో లక్షల మొక్కలు నాటారు. దుబాయ్ చెట్లుగా ముద్దుగా పిలుచుకునే ఇవి ఎక్కువగా అమెరికా ఖండంలోని తీరప్రాంతాల్లో పెరుగుతాయి. ముఖ్యంగా అరబ్ దేశాల్లో ఇళ్లపై దుమ్ముపడకుండా ఉండేందుకు ఈ చెట్లను పెంచుతారు. వేగంగా ఆకర్షణీయంగా పెరుగుతున్న ఈ మొక్కను నర్సరీల నిర్వాకరులు, ఇతర ల్యాండ్ స్కేప్ ఆర్టిస్టులు ఇండియాకు దిగుమతి చేశారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఆకర్షణీయంగా కనిపించేందుకు ఈ మొక్కలనే ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత రోడ్లు అందంగా కనిపిస్తాయనే ఉద్దేశంతో డివైడర్లు, ఫుట్ పాత్ ల పక్కన ఈ చెట్లను నాటుతున్నారు. ఈ కోనో కార్ఫస్ చెట్లను తెలుగులో ఏడాకుల చెట్లు అని కూడా అంటారు. అలాగే డెవిల్ ట్రీ అని కూడా పిలుస్తుంటారు.

## డేంజర్ మొక్కలు..

అయితే ఈ చెట్లు చూడటానికి అందంగా కనిపిస్తున్నా.. అవి చాలా డేంజర్ అని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ మొక్కల కారణంగా శ్వాసకోస వ్యాధులు, అస్తమా వంటి సమస్యలు ఎదురవుతాయంటున్నారు. అంతేకాదు ఈ చెట్టు భూ గర్భంలోని జలాన్ని కూడా తోడేస్తుందని.. ఈ చెట్టు ఏపుగా పెరిగిన తర్వాత.. వేరు ఏకంగా 80 మీటర్ల వరకూ భూమిలోకి వెళ్లి నీళ్లను తాగేస్తుందంటున్నారు. అంతేకాదు ఈ చెట్లకు అక్టోబర్ నుంచి జనవరి వరకు పువ్వులు కూడా పూస్తాయి. ఈ చెట్ల పువ్వుల పుప్పొడి కారణంగా ఆస్తమా, శ్వాసకోస ఇబ్బందులు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. గతంలో విశాఖపట్నంలో ఈ చెట్ల గురించి జరిగిన చర్చలో ఈ చెట్లతో పర్యావరణ వ్యవస్థలో ఎలాంటి ఉపయోగం ఉండదని.. అనేక దుష్ప్రభావాలు ఉంటాయని తేల్చి చెప్పారు. అందుకే కోనో కార్పస్ మొక్కలు తొలగించాలన్న డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతోంది.

## అక్కడ తొలగింపు..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పలు జిల్లాల్లో ఇప్పటికే కోనో కార్పస్ చెట్ల తొలగింపు ప్రారంభమైంది. ఆయా మునిసిపాలిటీల్లోని పాలక వర్గాలు ఈ మొక్కలపై సీరియస్ గా ఉన్నారు. వనమహోత్సవంలో భాగంగా తొలగించిన కోనో కార్పస్ మొక్కల స్థానాల్లో ఇతర మొక్కలను విరివిగా నాటే పనిలో పడ్డారు. మహబూబాబాద్ జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో ఈ మొక్కలను తొలగించారు. అయితే గ్రేటర్ పాలకవర్గం, అధికారులు మాత్రం మొద్దు నిద్ర విడడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక వ్యాధులకు మూలకారమవుతున్న కోనోకార్పస్ మొక్కలపై బల్దియా అధికారులు ఇంకా ప్రేమ వలకబోస్తున్నారు. వాటిని తొలగించేందుకు మీనమేశాలు లెక్కిస్తున్నారు. ప్రజలంతా రోగాల బారిన పడితే కాని గ్రేటర్ అధికారులకు కనువిప్పు కలుగదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వరంగల్ మహా నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గం స్పందించి నగరంలోని కోనో కార్పస్ మొక్కలను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

**పరకాలలోనే మెరుగైన వైద్యం అందించాలి**

**కలెక్టర్ పి.ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మాణంలో ఉన్న పరకాల ఆసుపత్రిలోని అన్ని అంతస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి ప్లాన్ ను పరిశీలించి ఏ వార్డు లు ఎక్కడ ఉన్నాయని అధికారులు అడిగి తెలుసుకున్నారు. రూ.35 కోట్లతో చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనులను అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి త్వరగా అందుబాటులోకి వచ్చేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ నారాయణ, ఈఈ ప్రసాద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం పరకాల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

## మహిళా శక్తి గ్రూప్‌లతో ములాఖత్..

మహిళా శక్తి గ్రూప్ సభ్యులు ఏర్పాటు చేసిన యూనిట్లు, వారు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ (గుర్తింపు), యూనిట్ల ముందు బోర్డులు వెంటనే అమర్చాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సూచించారు. బుధవారం పరకాల మండలంలోని మల్లక్కపేటలోని ఇందిరా మహిళా శక్తి గ్రూప్ సభ్యులు మైక్రో ఎంటర్ప్రైజెస్ లో భాగంగా ఏర్పాటు చేసిన మమతా టైలరింగ్, క్లాత్ స్టోర్స్, పిండి గిర్ని యూనిట్, డైరీ ఫార్మ్ ను అలాగే నడికుడాలోని అనిత టైలరింగ్, పూజ స్టోర్స్ ను సందర్శించి అక్కడి సభ్యులతో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం నడికుడ తహసిల్దార్ కార్యాలయంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. తర్వాత జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వాతావరణం మొక్కల నాటడం విద్యార్థుల బాధ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన 7, 8, 10వ తరగతి విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. నడికుడ మండలంలోని కంటాత్మకూరు గ్రామంలోని అంగన్వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలను, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా పూర్తి చేసిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఓ పీడీ నాగ పద్మజ, ఆర్డీఓ నారాయణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# శ్రీక్షితకు బంధుమిత్రుల ఆశీర్వచనం

**ఘనంగా సారీ ఫంక్షన్ | హాజరైన కుటుంబ సభ్యులు**

హనుమకొండలోని అసుంత భవన్ లో బుధవారం కుసుమ శ్రీక్షిత సారీ ఫంక్షన్ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మాయి తల్లిదండ్రులు కుసుమ సమత, సత్యనారాయణ (రాజు), తాతయ్యలు కుసుమ మల్లయ్య, చందా మల్లయ్య, బాపమ్మ కుసుమ భారతమ్మ, మేనమామ చందా సంజీవ్ తో పాటు సమీప బంధువులు పాల్గొన్నారు. గడ్డం లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, మహేందర్, కేశవమూర్తి, చంద్రశేఖర్, బిట్ల శ్రీరామ్మూర్తి, సత్యమ్మతో పాటు సుమారు 500 మంది బంధుమిత్రులు పాల్గొని శ్రీక్షితను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# వెహికల్ షెడ్ తనఖీ చేసిన మేయర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పారిశుద్ధ్య వాహనాల మరమ్మత్తులు జాప్యాన్ని సహించేది లేదని షెడ్డు కు వచ్చిన వాహనాన్ని తక్షణమే మరమ్మతులు చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని వాహనాల మరమ్మత్తుల షెడ్డును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల మరమ్మత్తులు, పెండింగ్ లో ఉన్న వాహనాల వివరాలపై ఆరా తీశారు. స్వచ్ ఆటో వాహనం ప్రతి ఇంటి నుండి విధిగా తడి పొడి చెత్త సేకరణ చేసుకుంటూ పుస్తకంలో యజమాని సంతకం తీసుకోవాలని, మూడు రోజులపాటు తడి, పొడి చెత్త స్వచ్ఛ ఆటో కు అందించని గృహాల వివరాలు తెలిపినచో వారిపై జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పాలన భేష్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ వద్ద బుధవారం రైతులు తమకు జరిగిన రుణమాఫీని బ్యాంకులో చూసుకోవడం కోసం వివిధ గ్రామాలకు చెందిన రైతులు బ్యాంకు తెరిచే సమయానికి ముందే బ్యాంకు ముందు పడిగాపులు కాశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పది రోజుల క్రితం రైతులకు లక్ష రుణమాఫీ చేయడం జరిగింది. నిన్న రైతులకు రూ. 1.50లక్షల వరకు రైతు రుణ మాఫీ చేశారు. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన చాలా బాగుందని హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలన కంటే కాంగ్రెస్ పాలనలోనే రైతుల సంక్షేమం జరుగుతుందని పలువురు రైతులు తమ ఆనందం తెలిపారు.

## పాఠశాలకు వాటర్ ట్యాంక్ బహుకరణ



**వరంగల్ వాయిస్, నడికూడ :** చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం ఆర్వో వాటర్ ను నిల్వ చేయడం కోసం లండన్ లో ఉంటున్న వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజు శ్రావ్య దంపతుల సోదరి తాళ్లపెల్లి హైమా జ్ఞాపకార్థం సుమారు పదివేల విలువ గల 200 లీటర్ల సామర్థ్యం గల స్టైన్లెస్ స్టీల్ వాటర్ ట్యాంక్ ను చర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు బుధవారం పీఆర్టీయూ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మందల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ లండన్ లో ఉంటు ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ట్యాంక్ అందజేసిన తాళ్లపల్లి రాజు శ్రావ్య దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి మాట్లాడుతూ ఎన్నారైలు ప్రభుత్వ పాఠశాలకు, విద్యార్థులకు వారికి తోచిన విధంగా సహాయం చేయాలన్నారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అచ్చ సుదర్శన్ కు పీఆర్టీయూ సభ్యత్వం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టేముక్కుల శ్రీనివాస్ రెడ్డి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కటుకొజ్వాల సతీష్, పరకాల మాజీ మండల శాఖ అధ్యక్షుడు మోడెం రాజేందర్ బాబు, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మీ, నందిపాటి సంధ్య, విద్యా వాలంటీర్లు బాబురావు, పరిషవేని జ్యోతి, ఐఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ నగర్ లో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చోల్లేటి రాజ సుకన్య ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలోనే ఉపాధ్యాయులు, పాఠశాల పిల్లలు కలిసి ఆ పాఠశాలలోనే పదవీ విరమణ అభినందన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సుకన్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని అన్నారు. ఈ వృత్తి చేపట్టడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని, ఈ వృత్తిలో కొనసాగుతూ అనేకమంది విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దంలో తన వంతు పాత్రను పోషించానని పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ పొందడం సహజమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాము, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్ల స్థలాలకై ఇంకెన్నాళ్లీ నిరీక్షణ

### అసెంబ్లీలో సీఎం ఇండ్ల స్థలాలపై ప్రకటన చేయాలి
### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి
### హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సీపీఐ భారీ ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదలు ఇండ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి తరలి వచ్చిన పేదలను ఉద్దేశించి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూంలు కట్టించి ఇస్తామని తీవ్ర నిర్లక్ష్యం చేసినందువల్లే అధికారం కోల్పోయిందని అన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయ చూపడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేద ప్రజలకు పక్కా ఇండ్ల నిర్మాణానికి నిధులను కేటాయించి తన వంతు బాధ్యతగా నెరవేర్చాలని, కానీ కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులపై ఉన్న ప్రేమ కేంద్ర ప్రభుత్వానికి పేదల సంక్షేమంపై లేదన్నారు. ఈ ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టెపాక రవి, నకీర్తి ఓదెలు, కండె నర్సయ్య, కొట్టె వెంకటేష్, కామెర వెంకటరమణ, అంబి సాంబయ్య, సుదర్శన్, శంకర్ నాయక్, పూర్ణచందర్, గుంటి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని మర్కజీ హైస్కూల్ లో విద్యార్థిని, విద్యార్థులకు డెంగీ, మలేరియా వ్యాధుల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీడబ్ల్యూఎంసీ బయాలజిస్ట్ మాధవ రెడ్డి హాజరయ్యారు. అనంతరం పాఠశాల నుంచి అవగాహన ర్యాలీని తీశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, మెటర్నిటీ హాస్పిటల్ వైద్యురాలు డా.గీత, శానిటరీ ఇన్ స్పెక్టర్ అనిల్, హెల్త్ ఇన్ స్పెక్టర్ బలభద్ర రవి, ప్రధానోపాధ్యాయులు జీవి రామారావు, ఏఎన్ఓ డా.వాసు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్ల అరెస్ట్



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** బీజేపీ మహిళా మోర్చా నాయకులను బుధవారం ఉదయం 4 గంటలకు ఆత్మకూరు పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు. నేడు మహిళా మోర్చా ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం ఉన్నందున పోలీసలు ముందస్తుగా అరెస్టు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా మహిళకు రూ.2500 ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి మోసం చేసింది. మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి మహిళా మోర్చా నాయకులకు భయపడి అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. త్వరలో వచ్చే స్థానిక ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని బీజేపీ మహిళా మోర్చా నాయకులు హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, మండల ఉపాధ్యక్షురాలు ఇర్సడ్ల రాణి, మండల కార్యదర్శి పెల్లి రోజా ఉన్నారు. మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, పెండ్లి సుమన్, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు.

# విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, నడికూడ :** వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. వన మహోత్సవం కార్యక్రమం పురస్కరించుకొని “పర్యావరణం -మొక్కల పెంపకం- మన బాధ్యతలు” అనే అంశంపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడికూడలో విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. పోటీలలో పదవ తరగతి విద్యార్థి బూర ప్రణయ్ కుమార్(మొదటి), 8వ తరగతి విద్యార్థిని మర్రి వైష్ణవి(ద్వితీయ), ఏడవ తరగతి విద్యార్థిని ఎండిగ సిరి మూడవ స్థానంలో నిలిచారు. కాగా, విద్యార్థులకు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పర్యావరణం పరిరక్షణ, మొక్కల పెంపకం పైన విద్యార్థులను ప్రశ్నలు అడిగి అభినందించారు. విద్యార్థులు తమ పాఠశాలలో ఇంటి వద్ద మొక్కలను పెంచి సంరక్షించాలని, విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ సమావేశంలో మండల తహసీల్దార్ నాగరాజు, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి.జయ, ఎన్.తిరుపతి, ఎల్.శివ చైతన్, ఆర్.సుమలత, డి.శ్రావణ్ కుమార్, మహమ్మద్ సుభాని, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నిర్భయంగా చట్టాలను ఆశ్రయించాలి

## జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విద్యార్థులకు నూతన చట్టాలు, సైబర్ క్రైం, బాల్య వివాహాల పైన అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. కురవి ఏకలవ్య మోడల్ స్కూల్ లో చదువుతున్న బాల బాలబాలికలకు సామాజిక అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మమేకమై పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలైన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నూతన చట్టాలు, షీ టీం గురించి వివరిస్తూ విద్యార్థులందరూ న్యూ క్రిమినల్ లా అండ్ సైబర్ నేరాలు అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్, వాట్సాప్ కాల్ మాట్లాడవద్దని, గ్రూపుల నుంచి వచ్చినటువంటి అపరచిత లింకులను ప్రెస్ చేయవద్దని వివరించారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 100,షీ టీమ్ నెంబరుకు సంప్రదించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీ-సేఫ్ ఆప్ (ట్రావెల్ సేఫ్)ను ప్రతి ఒక్క మహిళ ఉపయోగించుకోవాలన్నారు. మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు మౌనంగా భరించకుండా ముందుకు వచ్చి షీ టీమ్ ను సంప్రదించి, వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలని అవసరమైన ఆత్మ రక్షణ విద్యలను నేర్చుకోవాలన్నారు. గుడ్డిగా నమ్మొద్దని తమ వ్యక్తిగత విషయాలను, వ్యక్తిగత ఫొటోలని సోషల్ మీడియాలో గాని, ఇతరులకు గాని షేర్ చేయొద్దన్నారు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసే అవకాశం ఉంటుంది, కాబట్టి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా అలా బ్లాక్ మెయిల్ చేసినట్లయితే పరువు పోతుందని భయపడకుండా షీ టీమ్ ను సంప్రదించాలని... షీ టీం కి కంప్లైంట్ చేసినట్లయితే కంప్లైంట్ వివరాలు గొప్యంగా ఉంచబడతాయని, బాధితురాలు షీ టీమ్ ఆఫీస్ కు రాలేని పక్షంలో షీ టీం సభ్యులే వారి దగ్గరికి వెళ్తారని తెలిపారు. ఎలాంటి భయం లేకుండా కంప్లైంట్ చేయాలని, షీ టీమ్ వాట్స్ అప్ నంబర్స్ 8712656935, 7901142009 కి సమాచారం ఇచ్చి తగిన చర్య తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ శరవయ్య, కురవి ఎస్ఐ గోపి, స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ జ్యోతి, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారంలో కార్డెన్ సెర్చ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పరకాల ఏసీపీ ఆధ్వర్యంలో నడికూడ మండలం ధర్మారం గ్రామంలో బుధవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్ నిర్వహించి 28 టూ వీలర్స్, మూడు ఆటోలు సరైన పత్రాలు లేని వాహనాలకు రూ.13100 జరిమానా విధించడం జరిగింది. రెండు బెల్ట్ షాపులపై దాడి చేసి రూ.4950 మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పానీయాలకు బానిసలు కావద్దని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరకాల సీఐ క్రాంతి కుమార్, ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్, శాయంపేట సీఐ రజనీష్ కుమార్, పరకాల సబ్ డివిజన్ ఎస్సైలు, 30 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ నాయకుల అరెస్ట్ సరికాదు



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన ఆటో యూనియన్ జేఏసీ నాయకులను హైదరాబాద్ ఘోష మహల్, సైనయత్తు గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. బుధవారం ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర కార్యావర్గం పిలుపు మేరకు బుధవారం అసెంబ్లీ ముట్టడిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆటో యూనియన్ నాయకుల పిలుపు మేరకు మంగళవారం రాత్రి బయలుదేరి హైదరాబాద్ కు చేరుకున్నారు. ములుగు నుంచి 30 మంది ఆటో యూనియన్ నాయకులను అసెంబ్లీ ముట్టడి చేస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ ఆధ్వర్యంలో వందలాది మంది ఆటో డ్రైవర్లు ఒక్కసారిగా అసెంబ్లీ ముందు ప్రత్యక్షమై నిరసన కార్యక్రమం చేస్తుండగా పోలీసులు నాయకులను, కార్యకర్తను చెదరగొట్టి అరెస్ట్ చేసి హైదరాబాద్ ఘోషమహల్, సైనయత్తు గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ మాట్లాడుతూ అక్రమ అరెస్ట్ లను తీవ్రంగా ఖండిస్తామన్నారు. రేపు, ఎల్లుండి జరగబోయే రెండు రోజుల అసెంబ్లీ సమావేశాలలో ఆటో కార్మికుల కోసం ప్రత్యేక బడ్జెట్ రూ.10 కోట్లు కేటాయించాలని, అలాగే ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ కుటుంబాలకు రూ.20 లక్షలు చెల్లించాలని, 8000 ఉన్న ఇన్సూరెన్స్ ను వేయి రూపాయలకు తగ్గించాలని, ప్రత్యేక ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు ఆటో యూనియన్ జేఏసీ నాయకులు ఎండీ హైమద్, రత్నం రమేష్, మధుర కుమార్, గట్ల వీరస్వామి, పులి భద్రయ్య, తిరుపతి చారి, మహేందర్, ప్రసాద్, జిలేందర్, రాజేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల సంక్షేమమే ధ్యేయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ మాతా శిశు ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించి దానికి అనుగుణంగా హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, చిన్నారుల సంక్షేమమే ధ్యేయంగా అధ్యక్షుడు శారు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి అంచూరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పోషకాహార కిట్లను, పండ్లను పంపిణీ చేయడం, ఆరోగ్యకరమైన మాతృత్వం, శిశువు కోసం అవసరమైన పోషకాలను అందించారు. ఈ కార్యక్రమం తల్లి, శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మరణాల రేటును తగ్గించడం, ఆరోగ్యవంతమైన కమ్యూనిటీలను ప్రోత్సహించడం వంటి రోటరీ లక్ష్యంతో చేయబడింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శారు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అత్యంత బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. “హనుమకొండలో సానుకూల ప్రభావం చూపడానికి మా అంకితభావానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్యానికి పోషకాహారం కీలకమైన అంశం. ఈ మహిళలు, పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావడం గర్వ కారణమని తెలిపారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ అంబాల అంబరీష్, (ఆర్ఎంఓ) రోటరీ క్లబ్ వారి సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. రోగుల ఆరోగ్యం మరియు శ్రేయస్సును మెరుగుపరచడంలో ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ప్రభావవంతమైన సేవా ప్రాజెక్టులను అమలు చేయడానికి, సమాజ అవసరాలను తీర్చడానికి, రోటరీ సేవా విలువలకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కూడా పాల్గొన్నారు. అధ్యక్షుడు నామిని వంగ రాజారెడ్డి, అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గంగోజుల నరేష్, క్లబ్ మాజీ అధ్యక్షుడు రొండ్ల నరేందర్ రెడ్డి, ద్రాక్షపల్లి రమేష్, చిదర రాజశేఖర్, ఏవీ మురుగన్ పాల్గొన్నారు.

## వర్షాలకు ఇళ్లు కూలిన కుటుంబాలను ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన బైరి చిన్న కొమురయ్య ఇల్లు వర్షాలకు కూలిపోవడంతో వారి కుటుంబాన్ని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత 15 రోజుల నుండి వర్షాలు కురవడంతో అనేక గ్రామాల్లో ఇల్లు కూలిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే గుర్తించి ఇల్లు కూలిపోయిన ప్రతీ కుటుంబానికి రూ.10000 ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు గ్రామాలలో ఇల్లు కూలిపోయిన కుటుంబాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వానికి యుద్ధ ప్రతిపాదికంగా నివేదికలు పంపించవలసిన బాధ్యత జిల్లా ప్రభుత్వ అధికారులపై ఉందని ఆయన గుర్తు చేశారు. త్వరలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ను కలుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితుడు బైరి చిన్న కొమురయ్య, వడ్లకొండ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మకు బోనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆషాడ బోనాల సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ లోని స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి మైసమ్మ అమ్మవారికి కుటుంబసభ్యులతో కలిసి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్, ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్‌గా నమిండ్ల రవీందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హసన్ పర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన నమిండ్ల రవీందర్ హనుమకొండ జిల్లా తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ గా నియమితులయ్యారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం ఆదేశం మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరాలు బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్లో నియామక పత్రాన్ని నమిండ్ల రవీందర్ కు అందజేశారు. జిల్లాలో అంబేద్కర్ ఆశయాలను, గ్రామ గ్రామాన విస్తృత పరుస్తానని నమిండ్ల రవీందర్ పేర్కొన్నారు.

## దాసరి శైలజకు మద్రాస్ ఐఐటీ ప్రశంసాపత్రం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీ (కో ఎడ్యుకేషన్) ఈసీఈ విభాగ ఒప్పంద అధ్యాపకురాలు దాసరి శైలజ మద్రాస్ ఐఐటీ వారి ప్రశంసాపత్రం అందుకునట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్ వెల్లడించారు. దాసరి శైలజ భారత ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వయం పోర్టల్ ద్వారా “నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ యెన్హాన్సేడ్ (ఎన్హాన్స్ ) లెర్నింగ్ (నాప్టెల్ )” దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల ఆధ్వర్యంలో ఆన్ లైన్ లో నిర్వహిస్తున్న సర్టిఫికేషన్ కోర్సులు 13 పూర్తి చేసినందుకు గాను దాసరి శైలజకు మద్రాస్ ఐఐటీ నుంచి ప్రశంసా పత్రం అందినట్టు తెలిపారు. శైలజ 86వ స్థానం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో 2024వ సంవత్సరానికి వచ్చినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్ చెప్పారు. దాసరి శైలజను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, విభాగ అధిపతి డాక్టర్ కే. భిక్షాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన జాతీయ బడ్జెట్ పై చర్చలో పాల్గొంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజల న్యాయమైన హక్కులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరోసారి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ బడ్జెట్ పై తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడవ సారి బడ్జెట్ ను ప్రవేశపెట్టడం పట్ల ఆమెకు శు భాకాంక్షలు తెలిపారు. మా నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 14ఏండ్ల పాటు అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. రాష్ట్ర ఏర్పాటు జరిగిన 10ఏండ్లలోనే, అనతికాలంలోనే, చిరు ప్రాయంలోనే కేసీఆర్ అన్ని రంగాలలో గొప్పగా అభివృద్ధి చేశారు, దేశానికి ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దారని తెలిపారు. తెలంగాణలో నెలకొన్న శాంతి భద్రతలు, ప్రశాంతత, ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహంతో దేశ విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఆకర్షితులై ఎన్నో పరిశ్రమలు నెలకొల్పారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో మా రాష్ట్రానికి ఏమి దక్కలేదని ఆవేదన వెలిబుచ్చారు. దీంతో, స్వయంపాలన కోల్పోయి తాము అనామకులుగా మారిపోయామని తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్రప్రదేశ్ కు నిధుల వరద, తమ తెలంగాణకు బురద పారిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారని అన్నారు. తమ రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఏంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారనే భావన ప్రజలలో నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిధులు సాధించటట్టయితే.. వారికి ఇదే మొదటి చివరి గెలుపుగా మిగలనుందని జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల ఆరాటం, పోరాటం రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసమే తప్ప ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం పట్ల తమ బీఆర్ఎస్ కు, ప్రజలకు ఎటువంటి ఈర్ష్యా ద్వేషాలు లేవన్నారు. వాటితో సమానంగా నిధులు రాబట్టలేకపోయిన బీజేపీ, కాంగ్రెస్ ఏంపీలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అదే రాష్ట్ర సాధన,ప్రజల అభ్యున్నతినే లక్ష్యంగా, ధ్యేయంగా, అభిమతంగా పుట్టిన పార్టీ నుంచి ఎంపీలు గెలిచి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. మా ప్రజల న్యాయమైన డిమాండ్స్ పట్ల సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో హామీనిచ్చిన పాలమూరు -రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఐఐఎం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)నెలకొల్పాలి, కొత్తగా ఏర్పడిన 23జిల్లాలకు నవోదయ పాఠశాలలు మంజూరు చేయాలి, ఐటీఐఆర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపి యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాలి, సూరత్ తరహా మెగా టెక్స్టైల్ పార్కు నెలకొల్పి చేనేత రంగాన్ని మరింత ప్రోత్సాహించాలి, నేతన్నలను ఆదుకోవాలి, సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీకి మరిన్ని నిధులు కేటాయించాలి, కేసీఆర్ గతంలో పలుమార్లు కోరిన విధంగా రక్షణ భూముల్ని కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలి, దేశంలోని పేదలకు రూ.3కోట్ల గృహాలను నిర్మించే పథకంలో మా తెలంగాణకు 25లక్షల ఇండ్లు కేటాయించాలి, మామూనూరు విమానాశ్రయాన్ని ఆధునీకరించి పౌర విమానాలను ప్రారంభించాలి, అయోధ్య తర్వాత ప్రసిద్ధి చెందిన భద్రాచలం రాముల వారి ఆలయానికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉన్న కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

## డాక్టర్ పరికిపండ్ల అశోక్‌కు బికన్ ఆఫ్ ఎంపవర్ మెంట్ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలల సంరక్షణ, మహిళా సాధికారత తదితర అంశాలపై విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్ అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎఫ్ఎంఎం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలో నిన్న నిర్వహించిన సమావేశంలో బికన్ ఆఫ్ ఎంపవర్మెంట్ అవార్డు అందుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ రవికుమార్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దేవిడ్ రాజ్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీడబ్ల్యూఓ మధురిమ తదితరులు పాల్గొన్నారు.

## తపాలాశాఖ సేవలు సద్వినియోగం చేసుకోండి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తపాల శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరెండెంట్ అనంత రామ్ నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని గట్ల కానిపర్తిలో తపాల శాఖ పథకాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అధిక వడ్డీని, పొదుపు పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద మధ్య తరగతి ప్రజలకు పొదుపు మేలు చేస్తుందన్నారు. ఈ అవగాహన సదస్సులో శాయంపేట ఎస్ పీఎం జీవన్ రావు, ఐపీపీబీ ఎగ్జిక్యూటివ్ సముద్రాల లింగమూర్తి, సిబ్బంది సంతోష్, జగదీష్, అరుణ్, హైమావతి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనదారులకు జరిమాన

**వరంగల్ వాయిస్, శాయంపేట :** నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపినందుకు గాను నలుగురికి జరిమానా విధించారు. శాయంపేటకు చెందిన సాదు నాగరాజు, తోడేటి లోకేష్, ఒర్సు శ్రీనివాస్, మెరుగు అనిల్ నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి పరకాల ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షాలిని ముందు హాజరుపర్చగా ఆమె ఒక్కొక్కరికి రూ.2500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తానని వార్నింగ్ ఇచ్చారు.

## రేపటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో రేపటి నుంచి ఆగస్టు 7 వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిణి కె.మధురిమ మాట్లాడుతూ అమృతం కన్నా విలువైనది అమ్మ పాలు అన్నారు. చంటి బిడ్డకు ఆరోగ్యంతో పాటు పోషణను అందించి ఆరోగ్య సమాజాన్ని నిర్మించే ఉద్దేశ్యంతో ఈ సంవత్సరం "అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటుదాం" అనే నినాదంతో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని స్థాయిలలో ముద్రపాల ప్రాముఖ్యత, బిడ్డ పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే అందించడం, 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు బిడ్డకు అందించే అదనపు ఆహారంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు.

## ఉచిత దోమతెరల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని వరంగల్ పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో బుధవారం ప్రముఖ 41వ డివిజన్ ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన ప్రాథమిక ఆరోగ్య వైద్యుడు కోట యాదగిరి సీజనల్ వ్యాధులు ప్రజలకు వ్యాపించకుండా ఉండుటకు దోమతెరలు 30మందికి పంపిణీ చేశారు. యాదగిరి వారి తల్లిదండ్రుల పేర్లతో కేవీఎల్ వీ సేవా సమితిని ఏర్పాటు చేసి గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎండాకాలంలో మజ్జిగ ప్యాకెట్స్ వితరణ, చలికాలంలో రగ్గులు, దుప్పట్లు ఉచిత పంపిణీ చేస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవేర్ నెస్ కల్పిస్తూ ఉచిత వైద్య సర్వీస్ కూడా అందిస్తూ వైద్య వృత్తిలో జీవనం కొనసాగిస్తున్నారు. నగర ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## పాలకుల విధానాలతో అంపశయ్యపై చేనేత

### తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కేంద్ర, రాష్ట్రపాలకుల విధానాలతో తీవ్రమైన సంక్షోభంతో చేనేత అంపశయ్యపై ఉందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని రాజ బహదూర్ గౌర్ హాల్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మంగళంపల్లి జనార్దన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్న పాలకులు చేనేత పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.200కోట్లు మాత్రమే చేనేతకు కేటాయించడమేంటన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరిపి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నేతన్నల బ్రతుకులు మారుతాయనుకుంటే నిరాశే మిగిలిందని, చేనేతకు చేయూతనందించాలని చర్చించేందుకు అసెంబ్లీలో సీపీఐ పక్షనాయకులు కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానాన్ని పెడితే స్పీకర్ తిరస్కరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సవరణ చేసి తగిన విధంగా నిధులు కేటాయించి నేతన్నలకు పని కలిగించి ఆత్మహత్యల నివారించలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య ప్రసంగిస్తూ చేనేత కార్మికుల, సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ లోన్స్ రద్దు చేయాలని, చేనేతకు చేయూత, చేనేత మిత్ర పథకాలను అమలు పరచాలని, సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎం.జనార్దన్, అశోక్, రాములు, యాదగిరి, రాజయ్య, ధనంజయ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ సాంస్కృతిక సారథి పౌర సంబంధాల శాఖలో భాగమై పనిచేస్తున్న కళాకారుల గౌరవ వేతనం 24,514ను పీఆర్సీతో కలుపుకొని రూ.31,868 కి పెంచడం పట్ల . హనుమకొండ జిల్లా కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలనను హర్షిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు షేక్ వాజిద్ హుస్సేన్, జీడి సుధాకర్, ధారా దేవేందర్, డాక్టర్ వెన్నెల శ్రీనాథ్, కొండ సారంగపాణి, బూడిద సురేందర్, ఇనుగుర్తి మధు, వాంకుడోత్ రమేష్, మహమ్మద్ రజియా, గడ్డం కళావతి, అంబాల జయ, బొంకూరి రాణి, ఎండి రహీం పుల్ల వెంకటస్వామి కొయ్యడా సంధ్య, మైదం జోష్న, దేవి, మహమ్మద్ రహీమా, పుట్ట జానకి, పిట్టల చైతన్య, వద్దూరి శ్రీనివాస్, పలుమారి వేదవతి, పాల్వాయి సంధ్య, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల తరలింపుకు తగిన ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ఆగస్ట్ రెండో తేదీన ఎల్ బీ స్టేడియంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభకు ఉపాధ్యాయులను జిల్లా నుంచి తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు సమన్వయంతో జిల్లాలోని 13 మండలాలలో విద్య, మైనారిటీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలలో పదోన్నతి పొందిన సుమారు 634 మంది ఉపాధ్యాయులు హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో జరిగే సభకు హాజరై తిరిగి సురక్షితంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి ఒక బస్సు చొప్పున టీజీ ఆర్టీసీ బస్సులలో డ్రైవర్, అటెండెంట్, ఏఎన్ఎం, పోలీస్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఆగస్టు 2న 2 బస్సులు నర్సంపేట మండల కేంద్రం నుంచిఉదయం 6 గంటలకు, 12 బస్సులు ఉదయం 7 గంటలకు వరంగల్ కలెక్టరేట్ కార్యాలయం నుంచిబయలుదేరేలా చూసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, టీజీ ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మోహన్ రావు, జిల్లా రవాణా అధికారి లక్ష్మీ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




### గణాంక దర్శిని పుస్తక ఆవిష్కరణ..

సామాజిక ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పనలో గణాంకాలు పాత్ర ముఖ్యమైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గణాంక దర్శిని పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజువారి జీవితంలో గణాంకాల వాడకం విధానాలను రూపొందించడంలో గణాంకాలు దోహద పడతాయన్నారు. జిల్లా గణాంక దర్శినిలో జనాభా వాతావరణం ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం విద్య రవాణా, నీటి వనరులు, పంటలు కమ్యూనికేషన్ బ్యాంకింగ్ ఫైనాన్స్, లోకల్‌బాడీ ఇండస్ట్రీస్ సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉన్నాయన్నారు. గణాంక దర్శినిలో అన్ని శాఖల జిల్లా గణాంక వివరాలు పొందుపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ముఖ్య ప్రణాళిక అధికారి గోవిందా రాజన్, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఈఓ వాసంతి, ఆర్డీఓ కృష్ణవేణి, గణాంక అధికారి ఉషారాణి, ఉప గణాంక అధికారి ప్రభాకర్ తదితరులున్నారు.

# రైతు రుణ మాఫీ ఫిర్యాదులను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** రైతు రుణ మాఫీ సహాయ కేంద్రంలో స్వీకరించి దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. బుధవారం ములుగు వ్యవసాయశాఖ కార్యాలయంలోని రైతు రుణ మాఫీ సహాయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. రుణమాఫీలో పేర్లు లేని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు క్రాప్ లోన్ తీసుకున్న రైతులకు లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతులకు రెండవ విడత కింద ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు చేరి, రెన్యువల్స్ మాఫీ కావడం జరుగుతుందని ఆయన తెలిపారు. రుణమాఫీలో పేరు ఉన్న ప్రతి రైతు బ్యాంకుకు వెళ్లి రెన్యువల్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీ శ్రీపాల్, ఎంఏఓ సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రికార్డును బ్రేక్ చేసిన రేవంత్ సర్కార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఒకే రోజు 17 గంటలకు పైగా సుదీర్ఘంగా నిర్వహించి సరికొత్త రికార్డును సృష్టించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 12 గంటల పాటు సభను నడిపి రికార్డు ఎక్కిందని ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఆ రికార్డును బద్దలు కొట్టి చరిత్రకెక్కిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల, ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో సభను సమర్ధవంతంగా నిర్వహించిన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, మంత్రివర్గ బృందానికి, శాసనసభ్యుల బృందానికి అభినందనలు తెలుపుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



# అమ్మవారిపేట ఈఓకు వీడ్కోలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతర కార్యనిర్వహణాధికారి కమల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉర్సులోని నామయ్య గుడిలో జరిగిన ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ కమిటీ సభ్యులు కోడూరు భిక్షపతి, దాసి రాందేవ్, బైరి నాగరాజు, ఆవునూర్ కుమారస్వామి, ఆవునూరి నాగరాజు తదితరుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించారు. పూల మాలలు వేసి అభినందించారు.

# చిన్నారిని ఆశీర్వదించిన ఎర్రబెల్లి స్వర్ణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా ఒగ్లాపూర్ లో ద్వారక రిసార్ట్ లో హనుమకొండ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కేతిడి దీపక్ రెడ్డి కుమార్తె శాన్విక రెడ్డి మొదటి జన్మదిన వేడుకల్లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగికి ఉద్యోగ విరమణ విరామం కాదు

**వరంగల్ వాయిస్, కేయూ :** "నైపుణ్యం గల ఉద్యోగికి ఉద్యోగ విరమణతో విరామం కాదు" అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్ లో బిల్డింగ్ డివిజన్‌కు సంబంధించిన ఇంజినీర్ భవాని ప్రసాద్, క్యాంపస్ కళాశాలకు సంబంధించిన సీనియర్ కేర్ టేకర్ సయ్యద్ తాజుద్దీన్ ఉద్యోగ విరమణ సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రోజు రోజుకు ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందని వాపోయారు. ఉద్యోగ విరమణ ఉద్యోగుల అంకిత భావం,






క్రమశిక్షణ, పట్టుదల నేటి తరం ఉద్యోగులు నేర్చుకోవాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ పక్షాన రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్చాలతో సన్మానించారు. పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, అబివృద్ధి అధికారి ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి, ఆచార్య టి.మనోహర్ తో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ వల్లాల పృథ్వీ రాజు సంయోజకులుగా వ్యవహరించారు.

# మైసమ్మ దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ లోని కరీమాబాద్ బీరన్న నగర్ లో మైసమ్మ దేవాలయ నిర్మాణానికి తాను శాయశక్తుల కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఆషాడ మాసంలో బీరన్న నగర్ లోని మహిళలందరూ నెత్తిన బోనాలు పెట్టుకుని డప్పు వాయిద్యాలతో మైసమ్మ దేవాలయం చేరుకొని నైవేద్యం, టెంకాయలు, కట్న కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ మైసమ్మ తల్లి అనుగ్రహం ఆశీస్సులతో తాను బీరన్న నగర్ ప్రజలకు మౌలిక సదుపాయలతో పాటు గుడి నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఈ బోనాల జాతరలో స్థానిక నాయకులు బొల్లం యాకయ్య, రాధమ్మ, వెంకటమ్మ, వనం పద్మ, ఎల్లమ్మ, శ్వేత, బొల్లం రాజులు ఉన్నారు.



# థగ్‌లైఫ్‌లోకి నాజర్, అభిరామి

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం తెరకెక్కిస్తోన్న చిత్రం 'థగ్ లైఫ్'. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ఇందులో బడా స్టార్స్ నటిస్తుండగా.. తాజాగా మరో ఇద్దరూ నటీనటులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. సీనియర్ నటుడు నాజర్, అభిరామి ఈ చిత్రంలో నటించనున్నట్లు తెలుపుతూ నిర్మాణ సంస్థలు రాజ్‌కమల్ ఫిల్మ్స్, మద్రాస్ టాకీస్ సంస్థలు పోస్టర్లు షేర్ చేశాయి. 2004లో ఆమె కమల్ హాసన్ సినిమా 'విరుమండీ'లో నటించారు. మళ్లీ 20 ఏళ్లకు ఆయన చిత్రంలో అవకాశం రావడం.. అదీ మణిరత్నం దర్శకత్వంలో చేస్తుండడం కలలా ఉందన్నారు. నిర్మాణ సంస్థ పోస్ట్‌ను రీ షేర్ చేసిన అభిరామి 'కలలు కనడం ఎప్పటికీ ఆపకండి? ఎందుకంటే ఏదో ఒకరోజు అవి నిజమవుతాయి' అని రాసుకొచ్చారు.ప్రస్తుతం ఆమె నాని హీరోగా తెరకెక్కుతోన్న 'సరిపోదా శనివారం'లోనూ నటిస్తోంది. థగ్‌లైఫ్ కథ విషయానికొస్తే.. సముద్రపు దొంగల నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. 'నాయకన్' లాంటి హిట్ తర్వాత కమల్‌హాసన్ – మణిరత్నం కాంబోలో 36 ఏళ్లకు వస్తోన్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో దీనిపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇందులో త్రిష కథానాయిక. అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠీ, శింబు మలయాళ నటుడు జోజు జార్జ్, హీరో గౌతమ్ కార్తీక్, ఐశ్వర్య లక్ష్మి ఇందులో కీలక పాత్రలు పోషించనున్నారు. ఎ.ఆర్.రెహమాన్ స్వరకర్త.





# తెలుగులో శ్రీలీల దూకుడు

తెలుగు నాట వరుస భారీ సినిమాలతో దూసుకుపోతోంది అచ్చ తెలుగు సోయగం శ్రీలీల ఈ యేడు గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దగుమ్మ ఈమధ్య సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి తన ఎడ్యుకేషన్ పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో సెలవు లభించినప్పుడల్లా విహార యాత్రలు చేస్తోంది. ప్రైవేట్ కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొంటోంది. జాగా శ్రీలీల ఓ మ్యాగ్జిన్ కోసం బంగారు వర్ణం డ్రెస్‌లో దర్శనమిచ్చి అహుతులను షాక్‌కు గురి చేసింది.ఇంతకుముందు కన్నా కాస్త గ్లామర్‌ను జత చేసి హోయలు పోతూ తన అభిమానులకు సరికొత్త ట్రీట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.






# రోజూ నాలుగు నుంచి ఐదు గంటలు

## అనుభవనాలను వివరించిన మాళవిక

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా తెరకెక్కిన 'తంగలాన్' చిత్రంలో నటించడం వల్ల చర్మ వ్యాధుల బారిన పడినట్టు మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ తెలిపారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.. దర్శకుడు పా.రంజిత్ కు చెందిన నీలం ప్రొడక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో తెరకెక్కించారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ బంగారు గనుల్లో పనిచేసే తమిళ కూలీల ఇతివృత్తంతో పీరియాడికల్ మూవీగా దర్శకుడు పా.రంజిత్ రూపొందించారు. ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన అనుభవాలను మాళవిక మోహనన్ తాజాగా వివరించారు. 'ఈ మూవీలో వైవిధ్యభరితమైన పాత్రలో నటించాను. వేషధారణ కూడా అలాగే ఉంటుంది. ప్రతి రోజూ మేకప్ వేసుకునేందుకు కనీసం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టేది. ఎర్రటి ఎండల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే నేత్ర సమస్యలతో పాటు చర్మవ్యాధులతో ఇబ్బంది పడ్డాను. దీనికి కారణం.. మండిపోయే ఎండలు. పాత్ర కోసం వాడిన దుస్తులు. వేసిన మేకప్. దాదాపు ఐదారు మంది స్కిన్ స్పెషలిస్టుల (వైద్యులు)ను సంప్రదించాల్సి వచ్చింది' అంటూ మాళవిక మోహనన్ ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన అనుభవాలను వివరించారు.

# రాయన్‌లో ఆకట్టుకున్న ధనుష్ : మహేశ్ బాబు





ధనుష్ హీరోగా సందీప్ కిషన్, విజయ్ కాళిదాసు, దుషారా విజయన్, ఆపర్ణ బాలమురళి ప్రధాన పాత్రదారులుగా నటించిగా ఇటీవల థియేటర్లలో విడుదలై కలెక్షన్ల సునామీ సృష్టిస్తోన్న చిత్రం 'రాయన్' విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళు తున్నది. ఈ చిత్రాన్ని కథానాయకుడు ధనుష్ స్వయంగా రచన చేసి దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై ప్రేక్షకుల నుంచే కాకుండా తెలుగు, తమిళ సినీ సెలబ్రిటీల నుంచి కూడా ఊహించని విధంగా రెస్పాన్స్ వస్తోంది. సినిమాను పొగుడుతూ తమ తమ సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టులు పెడుతున్నారు.. తాజాగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఈ రాయన్ సినిమాను తిలకించి మూవీ గురించి తన అభిప్రాయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. రాయన్ సినిమా అసాంతం ధనుష్ తన నటనతో ఆకట్టుకున్నాడని అంతేగాక బ్రిలియంట్‌గా డైరెక్ట్ చేశాడని ప్రకాశ్ రాజ్, సందీప్ కిషన్, ఎస్జే సూర్య ఇతర నటీనటులు అదర్భుతంగా నటించారని, మ్యాస్ట్రో రెహమాన్ సంగీతం ఎలక్ట్రిఫైయింగ్ ఉందని ఇది ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అంటూ చిత్రంపై పొగడ్తల వర్షం కురిపించారు. ధనుష్ స్పందిస్తూ మీరు మా రాయన్ సినిమాను చూడడం ప్రశంసించడం హృదయాలను తట్టింది, మా టీమ్ అంతా థ్రిల్ ఫీలయ్యామని అన్నారు.

# గద్దర్ అవార్డులే గ్యాప్ పెంచాయా..



## ప్రభుత్వంతో ఢీ అంటున్న సినీ పరిశ్రమ
## పచ్చిగడ్డి వేస్తే మండుతున్న వైనం
## సర్వత్రా ఇదే చర్చ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వంతో సినీ ఇండస్ట్రీ ఢీ అంటే ఢీ అంటోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇరువర్గాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో అంటకాగిన సినీ వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరుతో అవార్డులను అందజేస్తామంటూ ప్రకటించిన నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య గ్యాప్ మరింత పెరిగింది. నంది అవార్డులకు బదులుగా గద్దర్ అవార్డులు ఇస్తామంటూ ప్రభుత్వ పక్షాన ప్రకటించినప్పటికీ సినీ పరిశ్రమ వైపు నుంచి ఎలాంటి ముందడుగు పడలేదని, కనీసం తనను సంప్రదించలేదని స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడం వైరల్ గా మారింది.

### గద్దర్ అవార్డులే కారణమా..

నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇస్తామన్నారు. ఈ అవార్డులపై ఇండస్ట్రీ ఆసక్తి చూపించలేదు. బహుశా పేరు కారణం కావొచ్చన్న వాదన ఉంది. కానీ గద్దర్ అవార్డులు అనేది గొప్పగా లేవని.. ఓ అవార్డుకు ఆ పేరు పెట్టి మిగతా మొత్తానికి నంది లేదా.. మరో ఉన్నతమైన పేరు పెట్టాలన్న ఆలోచననైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్న అభిప్రాయం ఉంది. అయితే అదే విషయం చర్చించవచ్చు. కానీ అలాంటిదేవిరీ లేదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సినీ ఇండస్ట్రీ .. ఏపీ ప్రభుత్వంతోనే ఎక్కువ సఖ్యతగా ఉంది. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమా వాళ్లు ఇప్పటికీ ఏపీ ప్రభుత్వానికే రిపోర్టు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత కొన్ని ఘటనలు జరిగాయి. డ్రగ్స్ కేసులు.. కొన్ని చెరువుల ఆక్రమణలు.. రోడ్ల వెడల్పు వంటి అభివృద్ధి పనులు ఇలా వరుస పెట్టి జరగడంతో సీన్ మారిపోయింది. అంతా బీఆర్ఎస్ పెద్దలకు దగ్గరయ్యారు. అప్పట్నుంచి బీఆర్ఎస్ కు సపోర్టుగా ఉంటూనే వచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ సహకరిస్తున్నా.. అంతగా సహకారం చూపించడం లేదు. కానీ రేవంత్ కూడా గతంలో ప్రభుత్వంపై చూపించినంత ప్రేమ తన ప్రభుతవంపై చూపించాలని కోరుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది.

### నేడో..రేపో ములాకత్..

వెంటనే చిరంజీవి స్పందించి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ఫిలిం చాంబర్ ను అప్రమత్తం చేశారు. నేడో రేపో ఇండస్ట్రీ బృందం ప్రభుత్వ పెద్దల్ని కలవొచ్చన్న ప్రచారం సాగుతోంది. కానీ అసలు సమస్య అది కాదని, రేవంత్ సినీ ఇండస్ట్రీ నుంచి మరింత సహకారం కోరుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది. సీఎంను కలసి మాట్లాడుతామన నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కూడా తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొంత మంది సినీ ప్రముఖులు ఆయనను కలిశారు. అవన్నీ వ్యక్తిగత భేటీలు. ఇండస్ట్రీ తరపున ఎవరూ ప్రత్యేకంగా ప్రతినిధి బృందంగా కలవలేదు. సహకారం కోరలేదు.

### గత ప్రభుత్వంతో సఖ్యత..

గత ప్రభుత్వంతో సినీ ఇండస్ట్రీ పెద్దలు ఎంతో సఖ్యతగా ఉండేవారు. అయినదానికి కానిదానికి సపోర్టుగా సోషల్ విరీడియాలో ప్రచారం చేసేవారు. ఉదాహరణకు.. మొక్కలు నాటే కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం పిలుపునిస్తే.. సినీ ప్రమఖులంతా మొక్కలు నాటి వాటిని సోషల్ విరీడియాలో వైరల్ చేసేవారు. గొప్ప కార్యక్రమం చేపట్టారని అభినందించేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం పిలుపునిచ్చినా స్పందన కానరావడం లేదు.

### నిర్లక్ష్యంగా ఇండస్ట్రీ..

సినిమా ఇండస్ట్రీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోంది. భారీ సినిమాలు వస్తే ఎక్స్ ట్రా షోలు, టిక్కెట్ రేట్ల పెంపకం వంటి విషయాల్లో వారు అడినట్లుగానే ఉత్తర్వులు ఇస్తున్నారు. ఈ మాత్రం సహకారం అందే ప్రభుత్వం పట్ల ఇండస్ట్రీ నిర్లక్ష్యంగా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కొద్ది రోజుల క్రితం.. సినిమా ప్రారంభానికి ముందు డ్రగ్స్ కు వ్యతిరేకంగా సందేశం ఉండాలని రేవంత్ ప్రకటించారు. దీనిపై ఒకరిద్దరు తప్ప పెద్దగా ఎవరూ స్పందించలేదు. సిద్దార్థ్ ఈ ప్రకటనకు వ్యతిరేకంగా స్పందించారు. తమకు ఉన్న బాధ్యత గురించి ఆయన చెప్పాలా అన్నట్లుగా మాట్లాడారు. తర్వాత క్షమాపణలు చెప్పారు కానీ..అప్పటికే నెగెటివ్ గా వెళ్లిపోయింది. ఇండస్ట్రీ మొత్తం ఈ అంశంపై ఓ తీర్మానం చేసి.. సీఎం నిర్ణయం ద్వారా... సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తామని సమైక్యంగా చెప్పలేకపోయారు. ఇది కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అసహనానికి గురి చేసి ఉంటుందని అంటున్నారు.

# నిజాయితీతో సేవాలందించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
## ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ లో తనిఖీ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పోలీస్ స్టేషన్ వచ్చే బాధితులకు నిజాయితీతో సేవాలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సీపీకి ఇన్ స్పెక్టర్ శివకుమార్ పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీంచారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సన్నిహిత సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరస్తి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని, పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని, అలాగే ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని, అరెస్ట్ చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థుల సమాచారాన్ని సంబంధిత రాష్ట్రాలకు అందజేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని సీపీ స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, ఇన్ స్పెక్టర్ శివకుమార్ తోపాటు ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




### సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి..

పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీలు సంజీవ్ సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్పర్జన్ రాజ్, సతీష్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్‌తో పాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బలరామునికే.. పార్టీ చీఫ్

## త్వరలోనే ప్రకటన

పీసీసీ పోస్ట్ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కీలక నేతలు జోరుగా లాబీయింగ్ చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి పనులు చక్కబెట్టే ప్రయత్నంలో ఉన్నారు. అయితే చివరి నిమిషంలో హైకమాండ్ ఎస్టీ నేత వైపు మొగ్గుచూపారని విశ్వసనీయ సమాచారం. అభ్యర్థి ఎవరనే అంశం కొద్దిరోజుల్లో తేలనుంది.

### అంతా ఓకే.. కానీ..

పీసీసీ చీఫ్ ఎంపిక కోసం ఇటీవల పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. హైకమాండ్ పెద్దలతో మాట్లాడారు. మంత్రులు, కీలక నేతల సూచనలను కూడా అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎస్టీ (లంబాడ) సామాజిక వర్గానికి చెందిన నేతకు పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతని అభ్యర్థిత్వంపై సీఎం రేవంత్ సహా మంత్రులు, కీలక నేతలు సానుకూలంగా ఉన్నారని సమాచారం. అందరి అభిప్రాయం తీసుకునే బలరాం నాయక్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని, ప్రకటించడమే మిగిలి ఉందని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగాచర్చ జరుగుతోంది.



### ఆలస్యం ఎందుకంటే..?

పీసీసీ చీఫ్ అభ్యర్థిత్వం కన్ఫామ్ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి వచ్చేనెల 2వ తేదీ నుంచి పన్నెండు రోజుల పాటు విదేశాలకు వెళుతున్నారు. ఫారిన్ టూర్ ముగించుకొని 14వ తేదీన స్వదేశం తిరిగొస్తారు. ఆయన రాష్ట్రానికి వచ్చిన తర్వాత పీసీసీ చీఫ్‌ను ప్రకటిస్తారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో ఉండకపోవడంతో పీసీసీ చీఫ్ అభ్యర్థి ప్రకటన వాయిదా పడిందన్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిపై స్పష్టత వచ్చిందని కాంగ్రెస్ నేతల్లో టాక్ నడుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు కార్యనిర్వహక అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉంది.



# మైసమ్మ బోనాల్లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని సందడి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మైసమ్మ బోనాల సందర్భంగా డీకే నగర్ లో నిర్వహించిన బోనాల జాతరకు తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, డివిజన్ అధ్యక్షులు పూజారి విజయ్, పొగాకు సందీప్, మాజీ కుడా డైరెక్టర్ మోడెం ప్రవీణ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com